ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు


మంగళవారం 18 జూన్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 28.0


● వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు నిమ్మల, పార్థసారథి, ఎంపీ పుట్టా మహేశ్, కలెక్టర్ వెంకటేశ్, ఎమ్మెల్యేలు బాలరాజు, పితాని, రోషన్, ముప్పిడి, చింతమనేని, ఆరిమిల్లి తదితరులు


● పోలవరం ప్రాజెక్టు వద్ద చంద్రబాబు కాన్వాయ్ పరుగులు


● సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్


గైడ్ బండ్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు


● పనుల ప్రగతిని మ్యాప్‌లో పరిశీలిస్తున్న సీఎం

పోలవరం మళ్లీ కళకళ

అన్ని పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు

- నాలుగు గంటలకు పైగా పోలవరంలోనే..
- గత ప్రభుత్వ వైఖరికి భిన్నంగా బాబు సరికొత్త నడక
- ఆస్వాదించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు
- ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష
- నిర్వాసితుల సమస్యలపైనా ఆరా

(ఏలూరు/పోలవరం-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గడిచిన ఐదేళ్లుగా పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తిగా వెనుకబడిపోవడాన్ని చంద్రబాబు సోమవారం తన పర్యటనలో గమనించారు. ఎన్నాళ్ళకు ప్రాజెక్టును పూర్తి చేస్తామో గతంలో అన్నీ వివరించేవారు. కాని, ధ్వంసమైన ప్రాజెక్టు పనులు చూసిన తర్వాత ఆయన ఆవేదనకు గురయ్యారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రాజెక్టు వద్దకు చేరుకున్న ఆయన గంటన్నరకుపైగా పనులను పరిశీలించారు. స్పిల్ వే వద్ద బ్లాక్-6 పనుల ప్రగతిపై అక్కడ అధికారులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించి, ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గైడ్ బండ్, గ్యాప్-3, యుఎస్‌సీడీ, గ్యాప్-1, గ్యాప్-2, డీఎస్‌వీడీ చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం పవర్ హౌస్ డౌన్ స్ట్రీం, అప్ స్ట్రీంలలో జరుగుతున్న పనులను చూశారు. ఒక్కో విభాగం వద్ద పది నుంచి పదిహేను నిమిషాలపాటు సమయం కేటాయించారు. దెబ్బ తిన్న డయాఫ్రం వాల్ చిత్రాలను తిలకించిన తర్వాత ఆయన ఆవేదనకు గురయ్యారు. ఈ పనులన్ని మిట్ట మధ్యాహ్నం ఎండలోనే బస్సులో ప్రయాణిస్తూ పరిశీలించారు. ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యాం పనులు ఎలా అవుతున్నాయో కూడా పర్యవేక్షించారు. ఆ లోపే బస్సులో తనతో ప్రయాణిస్తున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మహేష్ యాదవ్‌తో ప్రాజెక్టు పనులపై చర్చించారు. అసలు పోలవరం ప్రాజెక్టు రూపమే దెబ్బ తిందని, తన ఏరియల్ సర్వేలోను ఆ విషయాన్ని గమనించినట్టు వారి వద్ద ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు సీఎంగా తొలిసారి ప్రాజెక్టు సందర్శనకు రావడంతో ఈ ప్రాంతమంతా సందర్శకులు, అధికారులతో కళకళలాడింది. అంతకుముందే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ముఖ్య కార్యదర్శి ప్రాజెక్టు స్థలికి చేరుకుని సంబంధిత అధికారులతో సమీక్షించారు. చంద్రబాబు ప్రాజెక్టు స్థలికి చేరుకోగానే అధికారులతోపాటు మిగతా వారు ఎదురేగి స్వాగతం పలికారు. గతంలో ఐదేళ్లపాటు సీఎంగా ఉన్న జగన్ మూడుసార్లు మాత్రమే ప్రాజెక్టు నిర్మాణ స్థలికి రాగా అప్పట్లో అందరి కదలికలపైనా కట్టుదిట్టమైన ఆంక్షలు ఉండేవి. మీడియాతో సహా స్థానికులను సైతం కదలనీయని పరిస్థితి. ప్రభుత్వానికి ప్రతికూలంగా ఉన్న విలేకరులను పక్కన పెట్టేవారు. ఆ నాటి పరిస్థితి సోమవారం పటాపంచలైంది. ప్రత్యేకించి నిర్వాసితుల సమస్యపై చంద్రబాబు కొంతసేపు అధికారులతో సమీక్ష చేశారు. ఎవరికెంత చెల్లించాలి, ఇంకెంత పెండింగ్ అనే దానిపై అడిగి తెలుసుకున్నారు. జిల్లా నుంచి వివిధ ప్రాంతాల ప్రజా ప్రతినిధులు తరలి వచ్చి తమ ప్రాంత సమస్యలను రాత పూర్వకంగా సీఎంకు అందించే ప్రయత్నం చేశారు.

రాబోయే ఐదేళ్లలో..

రాబోయే ఐదేళ్ళల్లో పోలవరం ప్రాజెక్టును ఎలా గట్టెక్కించాలి, నిర్మాణ పనులన్నీ ఎలా కొలిక్కి తేవాలనే దానిపైనే ప్రధానంగా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు కనిపించింది. చంద్రబాబు సైతం డయా ఫ్రం వాల్ మరమ్మతులకు నాలుగు సీజన్ల కాలం పడుతుందని అధికారులు నివేదించినప్పుడు ఆశ్చర్యానికి గురయ్యారు. వచ్చే ఐదేళ్ళల్లో అమరావతితోపాటు పోలవరం పూర్తి చేయడమే ప్రధాన లక్ష్యంగా ఎంచుకున్న ఆయన ఇప్పుడున్న పరిస్థితిలో ఎలా గట్టెక్కాలనేది తేల్చుకునే దిశగానే అడుగులు వేస్తున్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉండడంతో భారీగా నిధులు రాబట్టి, ఆ దిశగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. తనకు అత్యంత ఇష్టమైన సోమవారం - పోలవరం నినాదం మరోసారి మరింత బలపడాలనేదే చంద్రబాబు ఆకాంక్షగా కనిపిస్తోంది. ఎక్కడా హంగూ ఆర్బాటం లేకుండా గడిచిన ఐదేళ్లపాటు జరిగిన నిర్లక్ష్యంపై ఒకవైపు నిలదీస్తూనే ఇంకోవైపు ఎలా ఒడ్డెక్కాలో ప్రజలే తేల్చాలని సీఎం చంద్రబాబు కోరడం అందరినీ అప్రమత్తమయ్యేలా చేసింది.

పెండింగ్ పనులు.. నిర్వాసితులే ముఖ్యం

రాబోయే ఐదేళ్ళల్లో పోలవరం ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడం, ఆలోపే నిర్వాసితులను పూర్తిగా ఆదుకోవడం వంటి లక్ష్యాలవైపు ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టుగా కనిపిస్తోంది. చంద్రబాబు పర్యటనలో ఈ విషయం తేటతెల్లమైంది. ఇప్పటికే నిర్వాసిత కుటుంబాలు తమకు జరిగిన అన్యాయాలను ఏకరువు పెడుతూనే కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందన్న నమ్మకంతో ఉన్నాయి. చంద్రబాబు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో మరోసారి సమీక్షకు దిగే అవకాశం ఉన్నట్టు పోలవరం అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు స్థలిలో జరిగిన సమీక్షలోను ఈ అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు అధికారులు అన్ని విషయాలను ఆయన చెవినవేశారు. ఇక ముందు జరిగే సమీక్షలన్నింటిలోనూ పనులతోపాటు సమాంతరంగా నిర్వాసితుల సమస్యలపైనా, పనులపైనా దృష్టి పెడతారని భావిస్తున్నారు. సోమవారం నిర్వాసితుల సమస్యలను సీఎం చంద్రబాబుకు ఏకరవు పెట్టేందుకు సీపీఎం ప్రతినిధులు ప్రయత్నించారు. రాత పూర్వకంగా అధికారులకు అందించారు.



ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం లభించింది. హెలీప్యాడ్ వద్దకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఇతర మంత్రులు కొలుసు పార్థసారధి, కందుల దుర్గేష్, ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, నిమ్మకాయల రాజప్ప, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి, ప్రాజెక్టు ఇంజనీరింగ్ చీఫ్ నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, సలహాదారు వెంకటేశ్వరరావు, సీఈ రమేశ్‌బాబు, జేసీ లావణ్యవేణి, ఆర్డీవో అద్దయ్య, ఏఎస్పీ స్వరూపరాణి, టీడీపీ నాయకులు గన్ని వీరాంజనేయులు, బొరగం శ్రీనివాసులు, జవహర్, అంగర రామ్మోహన్, వలవల బాబ్జి, జనసేన నాయకులు కరాటం రాంబాబు తదితరులు పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు.


● స్పిల్‌వే పైనుంచి పనులను పరిశీలిస్తున్న చంద్రబాబు

సీఎం పర్యటన సాగిందిలా..

- సీఎం చంద్రబాబు ఉదయం 11.47 గంటలకు పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకుని పనితీరును పరిశీలించారు.
- మధ్యాహ్నం రెండు గంటలకు ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకుని, జలవనరుల శాఖ అధికారులు, మంత్రులతో రెండు గంటలపాటు సమీక్ష చేశారు.
- సాయంత్రం 4.05 గంటలకు హెలీకాప్టర్‌పై ఉండవల్లి బయలుదేరి వెళ్లారు.

ఐదేళ్లలో విధ్వంసం : మంత్రి నిమ్మల

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ జగన్ విధ్వంసం చేశారని రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విమర్శించారు. సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పర్యటన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రాభివృద్ధి కోసం, వ్యవసాయాభివృద్ధి కోసం నదుల అనుసంధానం అవసరమని చంద్రబాబు భావించారు. అందుకే జలవనరుల శాఖ ఆధ్వర్యంలో 2014 నుంచి 2019 వరకు సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.80 వేల కోట్లు ఖర్చు చేశారు. జగన్ పరిపాలన వచ్చాక ఐదేళ్లలో కేవలం రూ.30 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇందులో 40 శాతం అవినీతికి పాల్పడ్డారు. పోలవరం ప్రాజెక్టును అదే తరహాలో ధ్వంసం చేశారు. అందుకే ప్రజలు వారిని 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధి చెప్పారు' అని అన్నారు.


● మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో వెళుతున్న చంద్రబాబు


● ప్రాజెక్టు పనులపై అధికారులను ప్రశ్నిస్తున్న చంద్రబాబు


● సీఎం డయా ఫ్రం వాల్ పరిశీలన


● మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష..


మంత్రి పార్థసారథిని సత్కరిస్తున్న చింతమనేని

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

- మంత్రి కొలుసు పార్థసారథి

పెదవేగి, జూన్ 17 : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆయన పెదవేగి మండలం దుగ్గిరాలలోని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇంటి దగ్గర సోమవారం ఉదయం అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెర వేర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిరోజునుంచే శ్రీకారం చుట్టారన్నారు. ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రాష్ట్రంలో పండుగ వాతావరణం ఏర్పడిందని, ప్రజల కోర్కెలను సాకారం చేయడానికి చంద్రబాబు కంకణబద్ధులై ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో పేదలందరికీ గూడు కల్పించడమే ధ్యేయంగా నిధులు మంజూరు చేస్తామని, దెందులూరు నియోజకవర్గానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. తొలుత మంత్రి కొలుసు, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌లను చింతమనేని పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం!

- ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థుల తరలింపు
- అనుమతికి మించి ఎక్కిస్తున్న వైనం
- నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లు
- పట్టించుకోని అధికారులు



ఏలూరు క్రైం, జూన్ 17 : పాఠశాలలు తెరిచారు. కళాశాలలు తెరిచారు. విద్యార్థులు ఆనందంతో తాము మరో తరగతిలోకి వెళ్లామంటూ మురిసిపోతూ పాఠశాల, కాలేజీలకు వెళ్తున్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని కలలు కంటున్నారు. తాము ఎంత కష్టపడినా ఆ కష్టం తమ పిల్లలకు కలగకూడదని ఆరాటపడుతున్నారు. తాహతుకు మించి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఇదే అదనుగా తీసుకున్న కొన్ని ప్రైవేటు కాలేజీలు, పాఠశాలల యజమానాలు అరకొర వసతులతో విద్యను అందిస్తున్నారు. మరోవైపు ఫిట్‌నెస్ లేని బస్సులతో, అర్హత లేని డ్రైవర్లతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

675 బస్సులకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్

జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా మొత్తం మీద 869 స్కూలు బస్సులు రిజిస్టర్ చేయించుకోగా ఈ ఏడాది కేవలం 675 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయి. ఇంకా 194 బస్సులు ఫిట్‌నెస్ పొందలేదు. మరికొన్ని కాలేజీలు, స్కూళ్లు కొత్త బస్సులను, సెకండ్ హ్యాండ్‌లో కొన్న బస్సులను ఏర్పాటు చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. వీటిని ఫిట్‌నెస్ చేయించాల్సి ఉంది. అనధికారికంగా కొన్ని బస్సులు తిరుగుతున్నట్టు గతంలో అధికారులు గుర్తించారు. పరిమితికి మించి బస్సుల్లో విద్యార్థులను తరలించడంతో బస్సులో ఎక్కువ సమయం నిలబడి ప్రయాణం చేయడం వల్ల కొంతమందికి వెన్నెముక సమస్యలు ఏర్పడుతున్నట్టు చెబుతున్నారు.

ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి..

జిల్లాలో ఏదైనా ప్రమాదం జరిగితేనే పోలీసులు, రవాణా శాఖ అధికారులు రోడ్డు ఎక్కి వాహన తనిఖీలు చేపడుతున్నారు. గతేడాది స్కూలు పిల్లలను తీసుకెళ్లే ఒక ఆటో డ్రైవర్ అతి వేగంగా వెళ్ళడంతో లారీ ఢీ కొంది. ఈ ప్రమాదం జరిగిన మరుక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేసి ఆటో డ్రైవర్లపై కొరడా ఝుళిపించారు. ఏలూరు సమీపంలో చొదిమెళ్ళ వద్ద ఒక కాలేజీ బస్సును డ్రైవర్ అతి వేగంగా నడిపి మలుపులో అదుపు చేయలేక బోల్తా కొట్టించాడు. ఆ సమయంలోను అధికారులు తనిఖీలు చేసి 18 స్కూలు, కాలేజీ బస్సులపై కేసులు నమోదు చేశారు. అనుమతికి మించి ఎక్కువ మందిని ఎక్కించుకున్న బస్సులపై జరిమానాలు విధించారు.

నిబంధనలు ఇలా..

60 ఏళ్ల వయస్సు పైబడి డ్రైవర్లను స్కూలు, కాలేజీ బస్సులకు నియమించకూడదు. ఐదేళ్ల కనీసం అనుభవం ఉన్న డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలి. టాక్స్, పర్మిట్, ఇన్సూరెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్ ఖచ్చితంగా ఉండాలి. బస్సుకు డ్రైవర్‌తో సహాయకుడు ఉండాలి. ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ కిట్లు తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్ పక్కన కాన్వెక్స్ మిర్రర్ ఉండాలి. అత్యవసర ద్వారాలు ఉండాలి. అయితే కొన్ని బస్సుల్లో ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ ఉండడం లేదు. కొంతమంది రిటైర్డ్ అయిన డ్రైవర్లను సైతం నియమిస్తున్నట్టుగా తెలుస్తోంది.

ప్రమాదకరంగా ఆటోలు..

కొంతమంది స్కూలు ఆటో డ్రైవర్లు విద్యార్థులను తమ పక్కనే కూర్చోబెట్టుకోవడం వల్ల డ్రైవింగ్ చేయడం కష్టమని ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా ఇవేమి తమకు పట్టవన్న ధోరణిలోనే తమ పక్కనే విద్యార్థులను ఎక్కించుకుని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఏలూరు నగరంలో నిత్యకృత్యం. చాలామంది ఆటోలకు ఇన్సూరెన్స్ కట్టడం లేదని తెలుస్తోంది. ప్రతి వాహనానికి థర్డ్‌పార్టీ ఇన్సూరెన్సు ఉండి తీరాల్సిందే. పోలీసులు, రవాణాశాఖ అధికారులు తక్షణం చర్యలు చేపట్టి విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



త్వరలోనే స్పెషల్ డ్రైవ్

జిల్లాలో 869 స్కూలు బస్సులు రిజిష్టర్ చేయించుకున్నారు. ఈ ఏడాది 675 స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకున్నారు. ఇంకా 194 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంది. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతాం. ఫిట్‌నెస్ లేకుండా స్కూలు, కాలేజీ బస్సులు నడిపితే బస్సులు సీజ్ చేసి సంబంధిత యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తాం. ఆటో డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లో డ్రైవింగ్ సీటు పక్కన ఎవ రిని కూర్చోబెట్టుకోకూడదు. మోటారు వాహన చట్ట నిబంధనల ప్రకారం స్కూలు, కాలేజీ బస్సులకు అన్ని ఉండాలి. ఏ ఒక్కటి లేకపోయినా కేసులు నమోదు చేస్తాం.

ఎస్.శాంతకుమారి, ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్, ఏలూరు జిల్లా

నిలిచిన సేవలు

- మీసేవ, సచివాలయాల్లో ఆగిన సర్వర్‌లు
- రాష్ట్రస్థాయిలో అప్డేట్ చేస్తున్న ప్రభుత్వం
- మరో మూడురోజులు ఇంతే..

ఏలూరు రూరల్, జూన్ 17 : ప్రభుత్వం మారడంతో రాష్ట్రస్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్‌లలో మార్పులు చేస్తున్నారు. ఈ పరిణామంతో మీ-సేవ, సచివాలయాల సేవలు అన్ని నిలిచి పోయాయి. గత కొద్దిరోజులుగా ఇదే పరిస్థితి. మరో మూడు రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయని జిల్లా అధికారులు వెల్లడిస్తున్నారు. రెవెన్యూశాఖకు సంబంధించి ఎటువంటి ఫైళ్ళు మార్పు చేయరాదంటూ ఆదేశాలు వచ్చాయి. రాష్ట్రస్థాయిలో ఐటీ సెల్‌లో అప్డేట్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు కావాల్సిన వన్(బీ) అడంగల్ వంటి పత్రాలు అందడం లేదు. విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువ పత్రాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లోనే ఉండిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా మీసేవ, సచివాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. రెవెన్యూ కార్యాలయాల్లో సర్వర్లు పనిచేయడం లేదు. ఒకటి, రెండుచోట్ల కాదు, జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. రైతులు మీ భూమి ద్వారా 1(బీ), అడంగల్ (బీ) పొంది తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. మరోవైపు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ రుణాలు రెన్యువల్, కొత్త రుణాలు పొందాలంటే చాలా బ్యాంకులు, తహసీల్దార్లు డిజిటల్ సంతకంతో కూడిన 1(బీ) అడుగుతున్నారు. అవి తీసుకోవాలంటే సర్వర్లు పని చేయడం లేదు. మీ భూమి ద్వారా తీసుకుంటున్న 1(బీ)లతో రుణాలను రెన్యువల్ చేయాలని రైతులు కోరుతున్నారు.


ఎర్రర్ చూపిస్తున్న సర్వర్

విద్యార్థుల పాట్లు

విద్యార్థులు మీసేవ, సచివాలయాల చుట్టూ కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం ప్రద క్షిణాలు చేస్తున్నారు. సర్వర్ నిలిచిపోవడంతో విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో కుల, ఆదాయ ధ్రువపత్రాలు విద్యార్థులకు తప్పనిసరి. గత మూడునెలలుగా రెవెన్యూ సేవలు ఎన్నికల కారణంగా నిలిచిపోవడంతో విద్యార్థులు, రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధ్రువ పత్రాలు మ్యాన్‌వెల్లో కూడా ఇవ్వక పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో మూడురోజుల పాటు సర్వర్లు పనిచేయవని, అధికారులు స్పష్టం చేశారు.

24 నుంచి రామవరప్పాడు వరకే డెమో

ఏలూరు మీదుగా నడిచే పలు రైళ్లు రూటు మళ్లింపు



నరసాపురం,జూన్ 17 : విజయవాడ రైల్వే డివిజన్‌లో ట్రాక్, ఇతర ఆధునీకరణ పనులు చేపడుతున్నందున ఈ నెల 21 నుంచి జూలై నెలాఖరు వరకు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రూటు మార్చగా మరి కొన్నింటిని రామవరప్పాడు వరకు మాత్రమే నడుపుతూ దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. వాటిలో నరసాపురం నుంచి 07862 నంబర్‌తో మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ వెళ్లే డెమో రైలును రామవరపుపాడు వరకే నడపనున్నారు తిరిగి రాత్రి 07861 నంబర్‌తో రామవరపుపాడు నుంచి 8.15 బయలుదేరి 12 గంటలకు నరసాపురం చేరుకుంటుంది.ఈనెల 21 నుంచి జూలై నెలాఖరు వరకు ఈ షెడ్యూల్ ప్రకారం నడవనుంది. ఇక మెయిన్ లైన్‌లో ఏలూరు మీదుగా నడిచే ఎర్నాకులం-పాట్నా (22643) ఎక్స్‌ప్రెస్ జూలై 1 నుంచి 22 వరకు గుడివాడ, భీమవరం మీదుగా నడవనుంది. భావనగర్- కాకినాడ (12756) ఎక్స్‌ప్రెస్ కూడా వచ్చే నెల 6 నుంచి 27 వరకు భీమవరం-గుడివాడ మీదుగా, ముంబయి నుంచి భువనేశ్వర్ వెళ్లే (11019) రైలు జూన్ 1 నుంచి 26 వరకు ఏలూరు, టీపీ గూడెం మీదుగా కాకుండా భీమవరం మీదుగా నడవనున్నాయి వీటితో పాటు మరికొన్ని ఎక్స్‌ప్రెస్‌లను కూడా భీమవరం మీదుగా మళ్లించారు.



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరులో ముగిసిన రైతుకూలీ సంఘం మహాసభలు

ఏలూరు రూరల్, జూన్ 17: ఏలూరులో మూడురోజుల నుంచి జరుగుతున్న రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభల్లో సోమవారం చివరిరోజు ప్రతినిధుల సభ జరిగింది. రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై రెండు దశాబ్దాలు గడిచినప్పటికి ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయిన లక్షలాదిమంది గిరిజన, గిరిజనేతర, పేద ప్రజలకు నేటికి న్యాయం జరగలేదన్నారు. పునరావాస కాలనీల్లో నిర్వాసితులు జీవనోపాధి కోల్పోయి వలసకూలీలుగా దుర్భర పరిస్థితుల్లో బతుకుతున్నార న్నారు. మొదటి ప్రాధాన్యతగా నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, భూమికి భూమి కొనుగోలు చేసి ఇచ్చేందుకు ప్రభుత్వం గిరిజనులతో చేసుకున్న ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పునరావాస సమస్యలను పూర్తిగా పరిష్కారం చేసిన తరువాతే ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. సభలో ఏఐకెఎంకెఎస్ జాతీయ నాయకులు సంబూ మహతౌవ్ మాట్లాడారు. ప్రజాసంఘాల నాయకులు ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ ఫండా, శ్రీవిముక్తి సంఘటన రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, బి.అరుణ, భాస్కర్, పీడీఎస్‌వో రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను తదితరులు పాల్గొన్నారు.

24 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక

మహాసభలో అధ్యక్షులుగా సింహాద్రి ఝాన్సీ, కార్యదర్శిగా డి.వర్మతో కూడిన 24 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. అనంతరం ప్రజా సమస్యలపై 20 తీర్మానాలను ఆమోదించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస సమస్యలు పరిష్కరించాలని, కనీస మద్దతు ధర చట్టం చేయాలని, పెండింగ్‌లో ఉన్న తాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి అటవీసంరక్షణ సవరణ చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వెనక్కి తీసుకోవాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి గ్రామీణ వలసలు అరికట్టాలని రైలు ప్రమాద ఘటనలకు ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా 24 తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు.



నందకిషోర్‌ను అభినందిస్తున్న జిల్లా యాదవ సంఘం నాయకులు

లండన్ ఇంపీరియల్ కళాశాలలో ఏలూరు విద్యార్థికి సీటు

ఏలూరు రూరల్, జూన్ 17: ఏలూరు పడమర వీధికి చెందిన మోటారు సైకిల్ మెకానిక్ కుమా రుడు నందకిషోర్ యాదవ్ లండన్‌లోని అత్యుత్తమ విశ్వ విద్యాలయం ఇంపీరియల్ కళాశాలలో ఉన్నత చదువులో ప్రవేశం పొంది నేటితరం యువతకు స్ఫూర్తిగా నిలిచాడు.పంజాబ్‌లోని ఎల్‌పీ యూనివర్శిటీలో బయోకెమిస్ట్రీలో బీఎస్సీ పూర్తి చేసిన నందకిషోర్, అప్లైయిడ్ జెనోమిక్స్ కోర్సులో ఎంఎస్ కోసం దరఖాస్తు చేసు కోగా లండన్‌లోని ఇంపీరియల్ కళాశాలలో సీటు లభించింది. ప్రపంచంలోనే అత్యున్నత విశ్వ విద్యాలయాల్లో రెండోస్థానంలో ఉన్న ఆ కళాశాలలో నందకిషోర్ సీటు సాధించడం గర్వకారణమని ఏలూరు జిల్లా యాదవసంఘం నాయకులు ప్రశంసించారు. జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు కిలారపు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు అజయ్,గోపాలకృష్ణ, రామారావు తదితరులు నందకిషోర్‌ను సత్కరించారు.

స్వర్ణమయ పథకానికి రూ.4.13 లక్షల విరాళం



ద్వారకా తిరుమల, జూన్ 17: శ్రీవారి ఆలయ విమాన గోపుర స్వర్ణమయ పథకానికి ఓ దాత కుటుంబం సోమవారం రూ.4.13 లక్షలను విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కె.సుధీర్, కనకవల్లి దంపతులు ఈ విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ ఈవో త్రినాథరావుకు అందించారు.దాత కుటుంబానికి బాండు పత్రం ఇచ్చి శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



శ్రీనివాసవర్మ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఢిల్లీ వెళ్లిన ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు

భీమవరం టౌన్, జూన్ 17 : కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రిగా నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ మంగళవారం బాధ్యతలు చేపడుతున్న నేపథ్యంలో సోమవారం రాత్రి గన్నవరం ఎయిర్ పోర్టునుంచి ఎమ్మెల్యేలు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, పత్సమట్ల ధర్మరాజు, పార్టీ నాయకులు పాకా వెంకట సత్యనారాయణ, దంతులూరి నరేంద్ర, సురేంద్ర తదితరులు ఉన్నారు.

ఒకవైపు బాధ.. మరోవైపు ఆవేదన



కుంగిన గైడ్ బండ్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న చంద్రబాబు

ధ్వంసమైన ప్రాజెక్టును చూసి చలించిపోయారు
పునర్నిర్మాణం, కాలయాపనపై పదేపదే ఆరా
తాను పడిన కష్టం బూడిదైందని ఆక్రందన
పోలవరం పర్యటనలో ముభావంగానే చంద్రబాబు

ఏలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించి లక్ష్యాలను అందుకోవడానికి నిరంతరం శ్రమించి మరికాస్త సమయం దొరికితే చమటోడ్చిన రోజులవి. మండుటెండల్లోను.. భారీ వర్షాలను కూడా ఖాతరు చేయకుండా సోమవారం నాడు పోలవరమే ధ్యాస, శ్వాసగా లక్ష్యాలవైపు కదిలిన రోజులవి. డయాఫ్రం వాల్ నిర్మాణంలోనైనా, స్పిల్‌వే పనుల్లోనైనా, కుడికాల్వ, పట్టిసీమ పనుల్లోను మడమ తిప్పకుండా శరవేగంగా అధికారులను పరుగులు పెట్టించి రికార్డుల కెక్కిన క్షణాలవి. గడిచిన ఐదేళ్ళల్లో పోలవరం పనులన్నీ మూలన పడడం ఒక ఎత్తయితే, తన హయాంలో అత్యంత కీలకమైన డయాఫ్రంవాల్ దెబ్బతిని ఏకంగా ప్రాజెక్టు నిర్మాణంపైనే పెను ప్రభావం చూపడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చలించిపోయారు. అప్పట్లో ఈ పనుల కోసం సోమవారం ఆయన క్షేత్రస్థాయిలోనే సమీక్షించేవారు. ఎందుకనంటే ప్రధాన డ్యాం నిర్మాణానికి డయాఫ్రంవాల్ అత్యంత కీలకం కాబట్టి ఎలాంటి ఏమరుపాటు లేకుండా అప్రమత్తం చేసేవారు. అలాంటి డయాఫ్రంవాల్ నిర్మాణానికి దాదాపు 446 కోట్ల రూపాయలు ఆనాడు ఖర్చు చేయగా, రికార్డు సమయంలోనే డయాఫ్రంవాల్ ఒక కొలిక్కి వచ్చింది. దీంతో ప్రధాన డ్యాం కాకుండా, ఇతర పనులను పూర్తిచేసి ప్రాజెక్టుకు తుది రూపు తేవాలని అప్పట్లో చంద్రబాబు ఆకాంక్షించారు. ఇప్పుడు అదే స్థానంలో దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళ్ళినప్పుడు సోమవారం చంద్రబాబు ముఖం కాంతిహీనం అయ్యింది. తన హయాంలో కష్టపడి నిర్మించిన పనులన్నింటినీ గడిచిన ఐదేళ్ళల్లో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి మరింతగా పతనమయ్యేలా చేయడం ఆయనను కలచివేసినట్టుగా కనిపించింది. ఆఖరుకి గ్యాప్‌లు భర్తీ చేయడంలోను జగన్ వహించిన నిర్లక్ష్యం అడుగడుగునా కనిపించింది.

గ్యాప్-1 భర్తీలో వహించిన నిర్లక్ష్యం అటు అధికారులు ప్రభుత్వానికి చేరవేయలేకపోయినా, ఒకవేళ చేరవేసి ఉన్నా జగన్ సర్కార్ స్పందించక పోవడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులపై ఎంతలా దెబ్బతీశాయో అధికారులను అడిగి మరీ తెలుసుకున్నారు. వాస్తవానికి గ్యాప్-1లో 150 అడుగుల మేర పూర్తిగా కొట్టుకుపోవడం పెను నష్టానికి దారితీయడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో పెద్దపెద్ద సుడిగుండాలు ఏర్పాటు కావడం, ఇప్పుడు దానిని భర్తీ చేయాలంటే ప్రభుత్వానికి అది పెద్ద సవాలుగా మిగలడం కూడా చంద్రబాబును బాధించినట్టు ఆయన ముఖ కవళికలను పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తుంది. ప్రాజెక్టు ప్రాంతానికి ఐదేళ్ళ తర్వాత సోమవారం మధ్యాహ్నం హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. ఆలోపే తన హయాంలో జరిగిన పనులు, ఈ మధ్యకాలంలో జరిగిన పనుల మధ్య వ్యత్యాసం గమనించేందుకు ఏరియల్ సర్వే నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంతకుముందు పోలవరం పర్యటనకు వచ్చినప్పుడల్లా ఉత్సాహంతో ఉండేవారు. ఇంజనీరింగ్ అధికారులకే రకరకాలుగా డైరెక్షన్లు ఇచ్చేవారు. ప్రాజెక్టు పూర్తికావడానికి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, మరెలాంటి ఆదేశాలు క్షేత్రస్థాయికి చేరాలనే దానిపైనా స్పష్టంగా వ్యవహరించేవారు. ఈసారి సుదీర్ఘ విరామం తర్వాత ప్రాజెక్టుకు వచ్చిన ఆయన జరిగిన పరిణామాలు ముందుగానే తెలుసుకుని కాస్తంత ఆవేదన చెందారు. అటు ఇంజనీర్ల సమీక్షలోను, ప్రాజెక్టు పనుల పరిశీలనకు వెళ్తూ తాను ప్రయాణిస్తున్న బస్సులోను దీనిపైనే ఆయన పదేపదే సంభాషించినట్టు సమాచారం. 'ఎలాంటి ప్రాజెక్టును ఎలా మార్చేశారు. 2014-19మధ్య ఎలా ఉండేది. అప్పట్లో అందరూ కలిసొస్తేనే కదా ఇంతవరకైనా ప్రాజెక్టు వచ్చింది. లేకపోతే వచ్చేదా ? ఈ ఐదేళ్ళల్లో సర్వనాశనం చేసేశారు. ఇప్పుడు డయాఫ్రంవాల్ నిర్మించాలన్నా, మరమ్మతులు చేయాలన్నా భారీగా ఖర్చుఅవుతుంది. మరింత సమయం పడుతుందని అంటున్నారు. ఇంకోవైపు స్పిల్‌వే పక్కన గైడ్‌బండ్ కుంగిపోయింది. దాని సంగతి తేల్చాల్సి ఉంది. ప్రాజెక్టును ఇప్పుడు చూస్తుంటే తెగ బాధేస్తుంది' అని అధికారులు, ఎమ్మెల్యేల ఎదుట బాధపడినట్టు చెబుతున్నారు. విలేకరుల సమావేశంలోను మీరు కూడా ఇప్పుడు ప్రాజెక్టు స్థితిగతులపై ఎవరి నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి పరిస్థితి ఏర్పడిందో సమగ్రంగా అధ్యయనం చేయండి. ప్రజల్లోను ఏం జరిగింది, మరేం జరగాలి అనే చర్చ జరగాల్సి ఉందంటూ చంద్రబాబు సూచించారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా నిధులు ఎలా రప్పిస్తారు, ఏపె కమిటీలు వేస్తారు, ఎవరెవరిపై చర్యలు తీసుకుంటారనే ప్రశ్నలకు ఇప్పుడది అవసరమే కాకపోయినా అసలు ఉన్న వాస్తవ పరిస్థితికి బాధ్యులెవరో తేల్చాల్సింది ప్రజలేనన్నారు. ఇంకాస్త అడుగు ముందుకేసి మీలాగే నన్ను కూడా ఈ ఐదేళ్ళల్లోను ప్రాజెక్టు స్థలికి రానీయకుండా చేశారు. 2022లో మీరందరూ చూశారు. ఇక్కడే బైఠాయించాను. అప్పటి సర్కారును గట్టిగా నిలదీశా. చూడండి అంటూ తన ఆవేదన వెళ్ళగక్కారు. దాదాపు నాలుగు గంటలకు పైగానే పోలవరంలో గడిపిన చంద్రబాబులో ఆవేదన స్పష్టంగా కనపడింది.

బదిలీ చేసినా.. మెమోలతో వస్తారు



పాతుకుపోతారు..ఆపై చక్రం తిప్పుతారు
ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పోలీస్ శాఖలో కొంతమంది సిబ్బంది తీరు ఇది

ఏలూరు క్రైం, జూన్ 17 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందిలో కొంత మంది తాము పనిచేస్తున్న పోలీస్ స్టేషన్ నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేసినప్పటికీ వివిధ కారణాలతో మెమో లతోనే తిరిగి గతంలో తాము పనిచేసిన పోలీస్ స్టేషన్‌లోనే పాతుకుపోతున్నారు. ఇక ఉన్నతాధి కారులను బదిలీలు చేయడం వల్ల ప్రయోజనం ఏముందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లాల విభజన తరువాత జిల్లాలోని పోలీసులు ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించబడ్డారు. గతంలోనే కొంతమంది సంబంధిత పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ప్రాంతాల్లో పాతుకు పోయారు. ఐడీ పార్టీల్లోనూ, స్టేషన్ రైటర్‌గానో లేదా సీఐ, ఎస్ఐ అనుచరులుగా ముద్ర వేసుకుని మొత్తం మీద చక్రం తిప్పారు. అలాంటి వారిని బదిలీ చేసినప్పటికీ తాము గతంలో పనిచేసిన ప్రాంతానికే ఏదో విధంగా ప్రజా ప్రతినిధులతో నైనా చెప్పించుకుని మరీ మెమోలతోనే డ్యూటీల్లో చేరుతున్నారు. కానిస్టేబుళ్ళు ఒక సబ్ డివిజన్‌లో ఆరేళ్ళు పైబడి పనిచేస్తే వేరే సబ్ డివిజన్‌కు బదిలీ చేయాల్సి ఉంది. హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐ, ఎస్ఐలు ఒక సబ్ డివిజన్‌లో రెండేళ్ల పనిచేస్తే వారిని వేరే సబ్ డివిజన్‌కు బదిలీ చేయాల్సి ఉంది. కానీ కొంత మంది సబ్ డివిజన్ మాట ఎలా ఉన్నా తాము పని చేస్తున్న పోలీస్ స్టేషన్‌లోనే సంవత్సరాలు తరబడి పాతుకుపోయి ఉంటున్నారు. ఇంకా కొంత మంది అయితే సర్కిల్ పరిధి కూడా దాట కుండా ఆ సర్కిల్‌లో ఉన్న స్టేషన్‌లలోనే చక్కెర్లు కొడుతున్నారు. కాదూ కూడదని నిబంధనల ప్రకారం వేరే సబ్ డివిజన్లకు బదిలీ చేశారంటే వారం కూడా గడవక ముందే మెమో తీసుకుని తాము ఎక్కడ నుంచి బదిలీ అయ్యారో అదే స్టేషన్‌కు వెళ్ళి యథేచ్ఛగా చక్రాలు తిప్పుతున్నారు. కొంతమంది ఆస్థాన స్టేషన్ నిర్వాహకులుగా పేరు గడించిన వారు ఆ స్టేషన్ల నుంచి బదిలీ అయినప్పటికీ తిరిగి అక్కడే చేరుకుకుంటున్నారు. గతంలో పలు ఆరోపణలు వచ్చి బదిలీలు అయిన పలువురు కూడా నెలల గడవకముందే తిరిగి తాము అనుకున్న ప్రాంతానికి మెమోలతో వచ్చి విధులను నిర్వర్తిస్తున్నారని తెలుస్తోంది. జిల్లాలో రెగ్యులర్‌గా ఉన్న సిబ్బంది కంటే మెమోలపై వచ్చిన సిబ్బందే పై చేయిగా ఉంటూ మిగిలిన సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కొంత మంది అధికారులు తమకు అవసరమైన సిబ్బందిని మెమోలతోనే తెచ్చుకుంటున్నారు. ఇలా వచ్చిన వారిలో కొంత మంది మాత్రమే ఇబ్బంది కలిగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొంత మంది అయితే కొన్ని స్టేషన్లలో ఆరేళ్ళ పైబడి విధులు నిర్వర్తిస్తున్నా వారికి బదిలీలు లేకుండానే చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏ పోలీస్‌స్టేషన్ చూసినా మెమోలపై సిబ్బంది కనిపిస్తున్నారని మరికొంత మంది లూపు లైన్లకు మెమోలతో వెళ్లిపోతున్నారని తెలుస్తోంది. కొంత మంది తమ నివాసాలకు దగ్గరగా ఉండే విధంగా సబ్ డివిజన్‌లో పరిధులు దాటి మరీ మెమోలతో విధుల్లో చేరుతున్నారని తెలుస్తోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇలాంటి మెమోలను పరిశీలిస్తే వందల్లోనే ఉన్నట్లుగా స్పష్టమవుతుంది. జీతం డ్రా చేసేది ఒక పోలీస్ స్టేషన్ అయితే విధులు నిర్వర్తించేది మరోచోట అన్న విధంగా జరుగుతుంది. అసలే పోలీస్ శాఖలో కొరత ఉండడంతో పోలీసులు విధులు నిర్వర్తించడానికి భారం పెరిగిపోయింది. 24 గంటలలో 16 గంటలు విధుల్లో ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొంత మంది మాత్రం మెమోలపై వచ్చి కాలక్షేపం చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెరుగైన సేవలు అందించడానికి సమర్థవంతంగా ఉన్నతాధికారులు తక్షణం పోలీసు శాఖలో సిబ్బందికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జూనియర్ ఛాంబర్ నాయకులు

విద్యార్థులకు మెరుగైన నైపుణ్యం అవసరం : కలెక్టర్

భీమవరం టౌన్, జూన్ 17 :విద్యార్థులకు మెరుగైన నైపుణ్యం అందించడానికి శిక్షణ అందివ్వడం గొప్ప విశేషమని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూల్లోనూ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు అభినందనీయమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జేసీఐ (జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్) నేషనల్ ప్రెసిడెంట్ రికేష్ శర్మ, జేసీఐ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జేసీఐ తరుపున జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ చేపడతామని, దానికి సహకారం అందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ రాజమండ్రిలో 50 మంది విద్యార్థులకు ఇటువంటి ట్రైనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశామని, వారిలో కొందరు గ్రూప్-1, గ్రూప్-2కు కూడా ఎంపికయ్యారని, రూరల్ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఇటువంటి ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఎంతో ఉపకరిస్తాయన్నారు. కేవలం స్కిల్స్‌లో మాత్రమే కాకుండా గ్రూప్-1, గ్రూప్-2 కు ఉపయోగపడే విధంగా శిక్షణ అందించాలని, జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ స్కూళ్లలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు శిక్షణ అందించాలన్నారు. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలకు వెళ్లేందుకు స్పోకెన్ ఇంగ్లీష్, ప్రొఫెషనల్ స్కిల్స్ ఇంటర్వ్యూలకు సంబంధించి కూడా శిక్షణ అందించాలన్నారు. జేసీఐ భీమవరం అధ్యక్షుడు పేరిచర్ల కృష్ణంరాజు, జేసీఐ సెక్రటరి పులగం మధుబాబు, జోనల్ ప్రెసిడెంట్ కే.కృష్ణభాస్కర్, డాక్టర్ గౌతమ్, కే.వంశీ, రాహుల్ సాయి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు సీతారాం (పాత చిత్రం)

అంబాజీపేట, జూన్ 17: టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన వారణాసి సీతారామ్ (53), అతని భార్య మహాలక్ష్మి, కుమార్తె లాస్యశ్రీ మోటారు సైకిలుపై ఈ నెల 16న అమలాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముక్కామల సమీపంలోకి వచ్చేసరికి రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళ్తున్న టిప్పర్ లారీ ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. ముగ్గురికీ తీవ్ర గాయాలు కాగా అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సీతారామ్ చికిత్స పొందుతూ మృతి చెందగా మహాలక్ష్మి చికిత్స పొందుతోంది. లాస్యశ్రీ కుడికాలు తొలగించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

అత్తిలి, జూన్ 17 : అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో ఒక వ్యక్తిని హత్య చేశారని ఫిర్యాదుపై ఉనికిలి గ్రామ పంచాయతీకి చెందిన కంకిపాటి రమేష్, రఘు అనే ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు అత్తిలి ఎస్ఐ రాంబాబు తెలిపారు. ఉనికిలి గ్రామానికి చెందిన వసంతాడ బెంజిమెన్ అనే వ్యక్తితో రమేష్, రఘులకు పాత గొడవలు ఉన్నాయని దీనిని దృష్టిలో పెట్టుకుని గత నెల 12న బెంజిమెన్ తలపై వారు కర్రలతో కొట్టడంతో గాయపడ్డాడు.బెంజిమెన్ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 1వ తేదీన మృతి చెందాడు. దీంతో బెంజిమెన్ భార్య పద్మ ఈనెల 2న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి ఆదివారం నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

రెండు మోటారు సైకిళ్లు అపహరణ

ఏలూరు క్రైం, జూన్ 17 : పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్ళు అపహరణకు గురయ్యాయని ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో రెండు కేసులు నమోదు చేశారు. జగన్నాథపురానికి చెందిన చోడగింజల ప్రభాకర్ దుగ్గిరాల సమీపంలోని ఒక పొలానికి వచ్చి అక్కడ మోటారు సైకిల్ పార్కింగ్ చేసి పొలంలోకి వెళ్ళారు తిరిగి వచ్చేటప్పటికి అది అపహరణకు గురైంది. ఈ సంఘటనపై ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ప్రభాకర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు సమీపంలోని శనివారపుపేటలో అద్దెకు నివాసం ఉంటున్న వట్టి వెంకటరామిరెడ్డి సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీలో బీడీఎస్ చదువుతున్నాడు. తన ఖరీదైన మోటారు సైకిల్‌ను ఆదివారం రాత్రి ఇంటిముందు పార్కు చేయగా తెల్లవారేసరికి అపహరణకు గురైంది. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్ విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 17 : ఏలూరులో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో శిక్షణ పొందుతున్న ఒక విద్యార్థిని అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన ఒక విద్యార్థిని (16) ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉన్న స్పోర్ట్స్ అథార్టీ ఆఫ్ ఇండియా (ఎస్ఎఐ) హాస్టల్‌లో ఉంటూ స్పోర్ట్స్ శిక్షణ పొందుతుంది. ఈనెల 16వ తేదీ సాయంత్రం తనకు కడుపు నొప్పి వస్తోందని మెడికల్ షాపునకు వెళ్త న్నానని చెప్పిన ఆ విద్యార్థిని తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కానరాకపోవ డంతో శాయ్ ఇన్‌ఛార్జి అయిన దూలం నాగేంద్ర వెంకట వినాయక ప్రసాద్ ఏలూరు టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉండి, జూన్ 17: ఉండి మండలం చెరుకువాడకు చెందిన రసు రాములమ్మ (80) ఈనెల 8వ తేదీన చుట్ట కాల్చుకోవడానికి అగ్గిపుల్లను వెలిగించగా ప్రమాదవశాత్తు చీరపై పడి నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో గాయాలైన ఆమెను అంబులెన్సులో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

గణపవరం, జూన్ 17: గణపవరంలోని చర్చిలో జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వీరవాసరం గ్రామానికి చెందిన యువకునికి, నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికకు వివాహం జరిపించేందుకు సిద్ధపడ్డారు. గణపవరం సూపర్‌వైజర్ చంద్రావతి, మహిళా పోలీసు సౌజన్య, కానిస్టేబుల్ సురేష్, అంగన్వాడీ కార్యకర్తలు ఈ వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికకు, కుటుంబ సభ్యులకు పోలీసులు, అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్ బాలికకు పెళ్ళి చేయడం చట్టరీత్యా నేరమని ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తారని, బాల్యవివాహాన్ని ప్రోత్సహించిన వారికి, బంధుమిత్రులకు జైలుశిక్ష విధించే అవకాశాలున్నాయని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టరు అడ్డగింత..కేసు నమోదు



జీలుగుమిల్లి, జూన్ 17: స్వర్ణవారిగూడెం సమీప కాలువలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.సతీష్ స్వర్ణవారిగూడెంలో అక్రమంగా కాలువ ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును అడ్డుకోగా టి.కృష్ణ అనే వ్యక్తి వాగ్వివాదానికి దిగాడు. దీంతో పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు చెప్పారు. నిందితుడు ట్రక్‌ను అక్కడ వదిలేసి ట్రాక్టర్ ఇంజన్‌తో పరారయ్యాడు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ

జంగారెడ్డిగూడెం, జూన్ 17 : కేతవరం గ్రామానికి చెందిన రైతు తోలేటి నరసంహమూర్తి పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టి అందులోని కాపర్ వైరును దొంగిలించుకు పోయినట్లు లక్కవరం విద్యుత్ శాఖ ఏఈ జోసెఫ్ జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జ్యోతి బాసు సోమవారం తెలిపారు.

రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధం

నరసాపురం టౌన్, జూన్ 17 : పట్టణంలోని 28 వార్డు మురికి కాల్వ గట్టుపై సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు పోర్షన్ల తాటికిల్లు దగ్ధమైంది.నల్లి జయరాజ్ సింగ్‌కు చెందిన ఇంట్లో రెండు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సమాచారం తెలిసి వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ఆస్తి నష్టం రూ.2 లక్షలు వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

3,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



పోలవరం, జూన్ 17 : పోలవరం మండలం ఎల్లండీ పేట, పోలవరం గ్రామాల్లో సోమవారం తమ సిబ్బందితో దాడులు నిర్వహించి 3,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఇనస్పెక్టర్ కోలా వీరబాబు తెలిపారు. ఎల్లండీ పేట గ్రామ శివార్లలో సారా తయారీకి వినియోగించే బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో పోలవరం గ్రామానికి చెందిన బీఎస్ ప్రకాశం, ఎల్లండీపేటకు చెందిన చిక్కాల సాయి సతీష్, సాగిపాడుకి చెందిన చల్లా నాగవర్మ ప్రసాద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

అలరించిన చిన్నారుల కోలాటం



కోలాటమాడుతున్న చిన్నారులు

ద్వారకాతిరుమల, జూలై 17: శ్రీవారి ఆలయ తొలిమెట్టు వద్ద చిన్నారులు కోలాట ప్రద ర్శన నిర్వహించారు. తెలంగాణ లోని సత్తుపల్లికి చెందిన పెద్దమ్మతల్లి కోలాట భజన బృంద సభ్యులు ముందుగా ఆలయంలో స్వామి, అమ్మ వార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ పాదుకామండపం వద్ద ఈ చిన్నారులు సంప్రదాయ దుస్తులతో వివిధ దేవతా మూర్తులను కీర్తిస్తూ నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. బక్రీద్ పర్వదినం సెలవు రోజు కావడంతో శ్రీవారి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల తాకిడి ప్రారంభమైంది. దాదాపు 15 వేల మంది వచ్చినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఏలూరు రూరల్, జూన్ 17: బీసీ జనాభా పెరుగుదలకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో సింహభాగం బీసీల కృషి, శ్రమ కనిపిస్తోందన్నారు. బీసీ జయహో పేరుతో ఇచ్చిన హామీ మేరకు జనాభా లెక్కించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముక్కుసూరి గోపాలకృష్ణ, అచ్యుత్ జయహో బీసీ సదస్సులో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి మారగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గొర్ల రామారావు, జేఏసీ నాయకులు రామసూరి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొండరెడ్లకు దోమ తెరల పంపిణీ



కొండరెడ్లకు దోమతెరలు పంపిణీ చేస్తున్న సభ్యులు

బుట్టాయగూడెం, జూన్ 17 : ఏజెన్సీ అటవీ ప్రాంతంలోని కొండరెడ్లు మలేరియా జ్వరా లు బారీన పడకుండా ఏలూ రు లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం మోతుగూడెం, తానిగూడెం కొండరెడ్లకు స్థానిక నాయకుల చేతుల మీదుగా దోమతెరలను పంపిణీ చేశారు. అంతేగాక గొడుగులు, చెప్పులు, భోజనం ప్లేట్లను 100 మందికి అందజేశారు. మాజీ సర్పంచ్ గురుగుంట్ల గంగిరెడ్డి, సంస్థ ప్రతినిధులు కొండరెడ్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

కొయ్యలగూడెం, జూన్ 17: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అంకాలగూడెం గ్రామానికి చెందిన సొంగా రాజేష్ కుటుంబానికి సామాజిక వేత్త ఆనంద్ స్వరూప్, ద్వారకాతిరుమల మండల తెలుగు యువత అధ్యక్షుడు ఉందుర్తి రమణ మహర్షి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పలువురు దాతలు కూడా ఆర్థిక సాయం అందజేసినట్లు రాజేష్ తెలిపారు.

పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

బుట్టాయగూడెం, జూన్ 17: ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతప్పగూడెంలో మడకం దుర్గారావు అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడు తూ గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ మౌలిక వసతులు కల్పించాలని నాణ్యమైన రోడ్లు నిర్మించి మంచినీటి సదుపాయాలు కల్పించాలన్నారు. కారం దారయ్య, జేవీ రమణరాజు, తెల్లం వీరమ్మ, గుండి నాగరత్నం, చోడే గంగరాజు, కుర్సం సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..శ్రీవారికి ఏకాదశి ఉత్సవం



ద్వారకాతిరుమల పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల, జూన్ 17: శ్రీవారి ఏకాదశి ఉత్సవం సోమవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో వైభవంగా జరిగింది. ఆలయంలో స్వామి, అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం పూజాధికాలను జరిపి ఆలయ ప్రధా న రాజగోపురం మీదుగా క్షేత్ర తిరు వీధులకు తీసుకొచ్చారు.

- ఏలూరు కార్పొరేషన్ : గాయత్రీదేవి అమ్మవారి జయంతి సందర్భంగా సత్రం పాడులోని అంబికాదేవి అమ్మవారి ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు భక్తి సంకీర్తనలు ఆలపించి లలితా పారాయణ నిర్వహించారు. అంబికా కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వర స్వామి, అశోక్‌నగర్‌లోని శ్రీవారి ఆలయం, పవరుపేట లోని వాసుదేవాలయం, అగ్రహారంలోని జనార్దనస్వామి కోవెల వద్ద ఏకాదశి పూజలతో భక్తులు ఆరాధించారు.
- కామవరపుకోట : జేష్ట శుద్ధ ఏకాదశి, నిర్జల ఏకాదశి, గాయత్రీదేవి జయంతి మహోత్సవం సందర్భంగా స్థానిక శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో విశేష పూజలు జరిపారు. గాయత్రీ పారాయణ నిర్వహించారు.
- పోలవరం : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శ్రీచక్ర సహిత నగరేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఇతర భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారికి అర్కపుష్ప, మారేడు దళాల పూజ, ఏకవార రుద్రాభిషేకం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ తెలిపారు.

సీఎంకు ఘన స్వాగతం

పోలవరంలో చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు, నాయకులు






సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలుకుతున్న ఎంపీ పుట్టా మహేశ్, మంత్రి నిమ్మల, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, కరాటం రాంబాబు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం పోలవరంలో పర్యటించారు. ఆయనకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. వీరిని చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తమ అభిమాన నేతతో ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, సీతారామలక్ష్మి






సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, సొంగా రోషన్‌కుమార్, చింతమనేని ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శేషు తదితరులు

సీఎం చంద్రబాబుతో మేము సైతం



మంత్రి నిమ్మలకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు



పోలవరం ప్రాజెక్టు సందర్శనలో చింతలపూడి టీడీపీ శ్రేణులు



హెలీప్యాడ్ వద్ద ఫొటోల కోసం నాయకుల జోరు

పోలవరం, జూలై 17: ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం పర్యటనలో సోమవారం కొద్దిపాటి తొక్కిసలాట జరిగింది. రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరు కున్న కూటమి నాయకులు, కార్యకర్తలు సీఎం హెలీ ప్యాడ్ ప్రాంతానికి చేరుకోగానే ఆయనతో ఫొటోల కోసం హెలీప్యాడ్ వద్దకు దూసుకొచ్చారు. ఈ క్రమంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు బల గాలు అతి కష్టంగా వారిని అదుపు చేశారు. సీఎంతో ఫొటో దిగడానికి అనుమతి ఇవ్వాలని పలువురు నాయకులు పోలీసులను అభ్యర్థించినా భద్రతా కారణాల రీత్యా పోలీసులు అనుమతించ లేదు.

- పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబును కలవడానికి జిల్లా సీపీఎం నాయకులు ప్రాజెక్టు వద్దకు వచ్చారు. భద్రతా కారణాల రీత్యా సీఎంను కలవడానికి భద్రతా బలగాలు నిరాకరించడంతో రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకి వినతిపత్రం ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కార దిశగా కృషి చేస్తామని మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే బాలరాజు వారికి హామీ ఇచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, తెల్లం రామకృష్ణ, గుడెల్లి వెంకట్రావు, సముద్రాల సాయికృష్ణ, నిర్వాసితురాలు సీత తదితరులు పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం :ముఖ్యమంత్రి చంద్రబాబును డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హెలిప్యాడ్ వద్ద కలిశారు. చంద్రబాబు కరాటంను యోగ క్షేమాలడిగి తెలుసుకున్నారు. పోలవరం నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు.
- కామవరపుకోట :సీఎం చంద్రబాబును చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, గుంటుపల్లి ఏరియా టీడీపీ అధ్యక్షుడు బేతిన వెంకట్రావు, కొండూరి శ్రీధర్, మిత్రబృందం తరలి వెళ్ళారు. చంద్రబాబుతో నాయకులు కొద్దిసేపు భేటీ అయ్యారు.
- జంగారెడ్డిగూడెం :ముఖ్యమంత్రి చంద్రబాబును చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామ కృష్ణ దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు, పార్టీ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, చెరుకూరి శ్రీధర్, మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఉన్నారు.
- ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పర్యటన ముగించుకుని వెళ్తున్న ముఖ్యమంత్రికి హెలీప్యాడ్ వద్ద నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు శేషు పుష్పగుచ్ఛం ఇచ్చి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన వారిలో టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు, మండల పార్టీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, చెరుకూరి శ్రీధర్, తాళ్లూరి వెంకటేశ్వరరావు ఉన్నారు..

నగర ప్రముఖులకు సత్కారాలు



రెడ్డి అప్పలనాయుడును సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 17 : స్థానిక రోటరీ క్లబ్ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని వీటీఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన నేపథ్యంలో నగరంలోని ప్రముఖులకు సత్కారాలు చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడును రోటరీ క్లబ్ ప్రతినిధులు దుశ్శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు.

నిత్యావసర సరుకుల అందజేత

దెందులూరు, జూన్17 : చేయూత సంస్థ ద్వారా ప్రతి నెల ఒక పేద కుటుంబానికి ఆదుకుంటున్నామని సంస్థ మం డల తెలుగు యువత అధ్యక్షుడు ఏనుగు రామకృష్ణ, సభ్యులు మేకా లక్ష్మీనారాయణ తెలిపారు. అక్కిరెడ్డిగూడెం లో సోమవారం జువ్వనపూడి నాగేశ్వ రావుకు బియ్యం, నిత్యావసర సరుకులు రూ.10 వేల ఆర్థిక సహాయం అంద జేశారు. తాత సూరిబాబు, పరసా నాగార్జున, గంగుల ప్రసాద్, మరీదు లక్ష్మీనారా యణరావు, రామకృష్ణతో పాటు చేయూత సభ్యులు వారికి అందజేశారు,

కూటమి నేతల ఫ్లెక్సీలకి పాలాభిషేకం



ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

భీమడోలు, జూన్ 17 : పింఛను పెంపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వ ర్యంలో భీమడోలు సంత మార్కెట్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ నాయకులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకు డు మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. దివ్యాంగులకు లబ్ధి చేకూరే విధంగా చేయాలని ఈ సంద ర్భంగా పలువురు నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నాగ భూషణం, రాము పాల్గొన్నారు.

ఫ్లెక్సీ వివాదం.. టీడీపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

పెదవేగి, జూన్ 17 : ఫ్లెక్సీ వివాదం చిలికి చిలికి గాలివానగా మారి, ధర్నా చేసేంతవరకు వెళ్ళింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం చక్రాయగూడెం పంచాయతీ సీతారామపురంలో ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి పక్కన ఎన్టీఆర్ విగ్రహం ఉంది. ఆ విగ్రహాన్ని మూసేస్తూ వైసీపీ నాయకులు సోమవారం మధ్యాహ్నం మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిలతో కూడిన ఫ్లెక్సీని కట్టడానికి పూనుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఎదురుగా కర్రలు పాతి, ఫ్లెక్సీని కడుతుండగా గమనించిన టీడీపీ నాయకులు అక్కడ కు చేరుకుని, ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా వైసీపీకి చెందిన ఫ్లెక్సీ కట్టడానికి వీల్లేదని అడ్డుకున్నారు. ఈ సమయంలో టీడీపీ-వైసీపీ వర్గీయుల మధ్య వివాదం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ఇరువర్గాలతో చర్చలు జరిపారు. ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీని తొలగించారు. కాగా అక్కడే బస్టాప్ మీద జగన్, అబ్బయ్యచౌదరిలతో కూడిన ఫ్లెక్సీ ఉండ డాన్ని గమనించిన టీడీపీ వర్గీయులు ఆ ఫ్లెక్సీని తొల గించాలని ప్రయత్నించారు. దీన్ని వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. అంతేకాక బస్‌స్టాప్‌పై ఉన్న ఫ్లెక్సీని తొలగిస్తే గ్రామంలో ఉన్న టీడీపీ ఫ్లెక్సీలు మొత్తం చించేస్తామని వైసీపీ శ్రేణులు పేర్కొన్నాయి. దీంతో పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ జోక్యం చేసుకుని, బస్‌స్టాప్‌పై ఉన్న ఫ్లెక్సీని ఆర్టీసీ అధికారులతో చెప్పి తీయించే ఏర్పాటు చేస్తామని, అంత వరకు సంయమనం పాటించాలని టీడీపీ నేతలు చెప్పా రు. దీంతో ఇరువర్గాలు శాంతించాయి. కాగా బస్‌స్టాప్‌పై ఉన్న ఫ్లెక్సీని తొలగించకపోతే మేమే తొలగిస్తామని టీడీపీ నాయకులు దొర్రాజు శివరామరాజు, గొర్రెల సుధాకర్, నరేంద్ర, కొనకళ్ళ శివమణి, మాదు రవికుమార్, అన్నపనేని సురేష్, తదితరులు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



ఏలూరులో మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జంగారెడ్డిగూడెంలో ఈద్గా వద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

ఏలూరుకల్చరల్/చింతలపూడి/టి.నరసాపురం/లింగపాలెం/ఉంగుటూరు/ద్వారకాతిరుమల/కామవరపుకోట/జంగారెడ్డిగూడెం/భీమడోలు/ పోలవరం, జూన్ 17: దైవప్రవక్త ఇబ్రహీమ్ మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు జిల్లాలో బక్రీద్ వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం మసీదులు, ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్‌లు ధార్మికోపన్యాసం చేశారు. ప్రతి ఒక్కరూ దాన గు ణం, సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమన్నారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఈ పండు గను జరుపుకుంటున్నట్లు తెలిపారు. పండుగ సందర్భంగా ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు. ఆయా కార్యక్రమాలలో

త్యాగానికి ప్రతీక బక్రీద్

పెదవేగి : త్యాగానికి, దానగుణానికి ప్రతీక బక్రీద్ అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు చింతమనేని శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాన్ని తెలియపర్చే బక్రీద్ పండుగను ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తిని పొందాలని ప్రభాకర్ సూచించారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే చంటి



మంత్రులతో ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు రూరల్, జూన్ 17:సీఎం చంద్రబాబు పోలవరం పర్యటన సందర్భంగా జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇంకా జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, దెందులూరు, ఉంగుటూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, పి.ధర్మ రాజు, సొంగా రోషన్ కుమార్, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు సత్కారం



సత్యనారాయణతో ఎమ్మెల్యే రోషన్‌కుమార్

కామవరపుకోట, జూన్ 17 : మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఇంటికే పరిమితం కావడంతో విషయం తెలుసుకున్న చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అనుచర బృందంతో కొత్తూరు మారుతీనగర్‌లో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. సత్యనారాయణ, టీడీపీ నాయకులు ఖాన్‌వజీర్, జిజ్జూరి బాబ్జీ బృందం ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు మెమెంటోతో సత్కరించారు.

నేడు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అభినందన సభ

చింతలపూడి : ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు మంగళవారం చింతలపూడిలో అభినందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయ నిర్వాహకులు జగ్గవరపు ముత్తారెడ్డి తెలిపారు. మారుతీ నగర్‌లోని ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో కూటమి ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేశామని, నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

మొక్కు తీర్చుకున్న పవన్ అభిమాని



మోకాళ్లతో మెట్లెక్కుతున్న పవన్ అభిమాని సత్తిబాబు

ద్వారకాతిరుమల, జూలై 17: జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కందుల దుర్గేష్ భారీ మెజారిటీతో గెలవడంతో ఓ అభిమాని మోకాళ్లతో శ్రీవారి మెట్లు ఎక్కి తన మొక్కు తీర్చుకున్నాడు. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం నడుపల్లెకు చెందిన పువ్వుల సత్తిబాబు పవన్ అభిమాని. ఈ ఎన్నికల్లో పవన్ కల్యాణ్, కందుల దుర్గేష్ గెలిస్తే తన కుటుంబంతో కలసి కాలినడకన ద్వారకా తిరుమల వచ్చి స్వామి వారిని దర్శిస్తానని మొక్కుకున్నాడు. సోమవారం మోకాళ్లపై మెట్లు ఎక్కి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నాడు.

చిన్నవెంకన్న సన్నిధికి పాదయాత్ర



పాదయాత్రగా వస్తున్న టీడీపీ నేతలు

ద్వారకాతిరుమల, జూన్ 17: శ్రీవారి క్షేత్రానికి పలువురు టీడీపీ నేతలు కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం నుంచి పాదయాత్రగా క్షేత్రానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. చింతలపూడి ఎమ్మెల్యేగా సొంగా రోషన్ కుమార్ భారీ మెజారిటీతో గెలు పొందడంతో వారంతా తెల్లవారుజామున బయలుదేరి క్షేత్రానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రైతుల్లో చిగురించిన.. ఆశలు

- వైసీపీ సర్కార్ నిర్లక్ష్యంతో అడుగు పడని.. చనుబండ, విస్సన్నపేట ఎత్తిపోతల పథకాలు
- గత టీడీపీ హయాంలో రూ.698.9 కోట్లు విడుదల
- 3 ఏళ్ల క్రితం నిధుల కోసం ప్రజా ప్రతినిధుల వినతి
- అయినా ఫైలుకు కలగని మోక్షం
- మంత్రి పార్థసారథిపైనే రైతుల ఆశలు

వైసీపీ సర్కార్ నిర్లక్ష్యంతో ఐదేళ్ళు మూలపడిన చనుబండ, విస్సన్నపేట ఎత్తిపోతల పథకానికి మోక్షం కలుగుతుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరటంతో చనుబండ, విస్సన్నపేట ఎత్తిపోతల పథకంపై రైతుల్లో ఆశలు చిగురించాయి. నూజివీడు ఎమ్మెల్యేగా గెలిచిన కొలుసు పార్థసారథి ఎన్నికల ప్రచారంలో ఈ పథకానికి నిధులు విడుదల చేయించి కరువు గ్రామాలకు గోదావరి జలాలు రప్పిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పార్థసారథి మంత్రిగా కూడా బాధ్యతలు స్వీకరించడంతో హామీ నిలబెట్టుకుంటారని ఆయకట్టు రైతులు ఆశతో ఉన్నారు.

(చాట్రాయి)

ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని నూజివీడు, తిరువూరు, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గాలలో 5 మండలాలలో చింతలపూడి ఫేజ్-2 కిందకు రాని మెట్ట భూములకు సాగునీరు, సుమారు 70 గ్రామాలకు తాగునీరు అందించటానికి గత టీడీపీ ప్రభుత్వంలో రూపొందించిన చనుబండ, విస్సన్నపేట ఎత్తిపోతల పథకం పనులు కూటమి సర్కార్ ప్రారంభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ పథకానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని మూడేళ్ళ క్రితం అప్పటి నూజివీడు, తిరువూరు, మైలవరం శాసనసభ్యులు మేకా ప్రతాప అప్పారావు, రక్షణనిధి, వసంత కృష్ణప్రసాద్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, నాటి సీఎం జగన్‌కు వినతి పత్రం అందజేశారు. అయినా ఆ ఫైల్‌కు మోక్షం మాత్రం మోక్షం కలగలేదు. ఈ పథకం పూర్తయితే చాట్రాయి మండలంలో 11,300 ఎకరాలు, రెడ్డిగూడెం మండలంలో 4500 ఎకరాలు, ముసునూరు మండలంలో 3,200 ఎకరాలు, నూజివీడు మండలంలో 14,200 ఎకరాలకు సాగునీరు అందటంతో పాటు, 70 గ్రామాల ప్రజలకు తాగునీరు అందించటం పథకం లక్ష్యం. పై ఆయకట్టు గ్రామాల్లో రైతులు వర్షాధారంతో సాగుచేస్తూ అనేక కష్టనష్టాలకు గురౌతున్నారు. భూగర్భ జలాలు కూడా ప్రమాదకర స్థాయిలో అడుగంటి సాగు, తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

నాడు విన్నవించగానే నిధులు మంజూరు చేసిన చంద్రబాబు..

2017లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2 శంకుస్థాపనకు విస్సన్నపేట సమీపంలోని మద్దులపర్వ గ్రామానికి వచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు చింతలపూడి-2 కాల్వపై లిఫ్టులు ఏర్పాటు చేసి కరువు పీడిత గ్రామాలకు సాగు, తాగు నీరు అందించాలని చంద్రబాబుకు వినతి పత్రాలు అందించారు. వెంటనే స్పందించిన చంద్రబాబు లిఫ్టల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించి, తక్షణం సమగ్ర సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. దాంతో ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేసి చింతలపూడి-2 ప్రధాన కాల్వపై చాట్రాయి మండలం కోటపాడు, పిట్టలవారిగూడెం, సూరంపాలెం వద్ద ప్రధాన లిఫ్టులు, విస్సన్నపేట స్టేజ్-1 కాల్వపై ఆరుగొలనుపేట, చిత్తపూరు గ్రామాల వద్ద సబ్ లిఫ్టల ఏర్పాటుకు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. 2019 ఫిబ్రవరి 6న ఈ పథకానికి సంబంధించిన జీవో నం. 15 ద్వారా రూ. 698.9 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలనామోదం ఇచ్చింది. ఈపీసీ పద్ధతిలో మెగా ఇంజనీరింగ్ కంపెనీకి పనులు అప్పగించారు. ప్రాజెక్టుకు కావల్సిన కాంటూరు, భూ సేకరణ ప్లాన్లు తయారు చేస్తుండగా ఎన్నికలు వచ్చి పనులకు బ్రేక్ పడింది. ఇప్పటికీ అదే పరిస్థితి ఉంది. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పుడు మరల కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఈ ప్రభుత్వమైనా స్పందించి ఈ పథకానికి నిధులు మంజూరు చేసి తమకు సాగు, తాగు నీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


చాట్రాయి మండలం పిట్టలవారిగూడెం వద్ద ప్రధాన లిఫ్టు నిర్మాణ ప్రదేశం

ప్రతి ఏటా నష్టపోతున్నాం..



సాగునీటి వసతి లేక తరచూ నష్టాల పాలవుతున్నాం. అనావృష్టి పరిస్థితులు ఎదురైతే పంటలు ఎండిపోతున్నాయి. ఎత్తిపోతల పథకం ద్వారా సాగు, తాగు నీరు వస్తుందని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. కొత్త ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి.

- ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, ఆయకట్టు రైతు ఆరుగొలనుపేట, చాట్రాయి మండలం.

కరువు కాటకాలతో సతమతం



కొన్ని తరాల నుంచి సాగునీరు లేక కరువు కాటకాలతో సతమతమవుతున్నాం. వర్షాధారంతోనే పంటలు సాగుచేస్తూ నష్టాలతో కుంగిపోతున్నాం. ఎత్తిపోతల పథకం మంజూరైందని సంబరపడ్డాం. పనులు ప్రారంభం కాకపోవడంతో నిరాశ ఆవరించింది. ప్రభుత్వం ఇక్కడ పరిస్థితిని పరిశీలించి నిధులు మంజూరు చేసి పథకాన్ని పూర్తిచేయాలి.

-కొత్తపల్లి వెంకట రామదాసు, ఆయకట్టు రైతు, చిత్తపూరు, చాట్రాయి మండలం.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

ఈ పథకానికి నిధులు మంజూరు చేయాలని ఏలూరు ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలు సీఎంకు సిఫార్సు చేసిన తరువాత ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అడిగిన వివరాలు అందజేశాం. ఈ పథకాన్ని డి- కేటగిరిలో ఉంచారు. ఎప్పుడైనా నిధులు మంజూరుకు అవకాశం ఉందని చింతలపూడి-2 డీఈఈ రాజ్‌కుమార్ చెప్పారు. ఎటువంటి నీటి వసతిలేని గ్రామాలకు సాగు, తాగునీరు అందించటానికి ఉద్దేశించిన ఈ పథకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఆశిస్తున్నామని డీఈఈ అన్నారు.

-రాజ్‌కుమార్, డీఈఈ


నిప్పంటించడంతో కొంత మేర దగ్ధమైన బ్యానర్

టీడీపీ బ్యానర్‌కు నిప్పంటించిన ఆగంతుకులు

నూజివీడు, జూన్ 17: నూజివీడు పెద్దగాంధీబొమ్మ సెంటర్లో ఏర్పాటుచేసిన టీడీపీ బ్యానర్‌కు ఆగంతుకులు నిప్పంటించారు. నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖా మంత్రిగా ఎన్నికైన అనంతరం తొలిసారి నూజివీడు నియోజకవర్గంలో పర్యటిస్తున్న నేపథ్యంలో టీడీపీ శ్రేణులు బ్యానర్లను ఏర్పాటు చేసి భారీ స్వాగత సన్నాహాలు చేశాయి. ఈ క్రమంలో నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్లో ఏర్పాటుచేసిన బ్యానర్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం నిప్పంటించారు. అయితే బ్యానర్ కొద్దిమేర దగ్ధమై ఆరిపోయింది. దీనిపై నూజివీడు పట్టణ సీఐకి టీడీపీ శ్రేణులు సమాచారం ఇచ్చి సీసీ ఫుటేజ్ ఆధారంగా దోషులెవరో తెలుసుకోవాలని కోరారు.



కూలిన వంతెనను పరిశీలించిన కామినేని

కలిదిండి, జూన్ 17 : పెదకొమ్ములేరుపై కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కూలిన పోతుమర్రు - కొండూరు వంతెనను ఆర్అండ్‌బీ అధికారులతో కలసి పరిశీలించారు. శాశ్వత వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఫోన్‌లో విన్నవించగా, మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సందర్భంగా కామినేని తేలికపాటి వాహనాల రాకపోకలు సాగించేలా తాత్కాలిక వంతెన నిర్మించాలని అధికారులను ఆదేశించగా ఆర్అండ్‌బీ డీఈఈ విజయ శ్రీకర్ మాట్లాడుతూ కూలిన వంతెన శిథిలాలను తొలగించటం కష్టతరంగా ఉండటంతో జాప్యం జరుగుతోందని, శిథిలాలను పూర్తిగా తొలగించిన వెంటనే తాత్కాలిక వంతెన నిర్మిస్తామని, నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, భీమరాజు, పారిశ్రామికాభివృద్ధి మాజీ డైరెక్టర్ సంబూరి హరికృష్ణంరాజు, ఎన్.జి.ఆర్.బాబు, ఎంపిడివో దినతేజ్ పాల్గొన్నారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే కామినేని సమీక్ష

కైకలూరు, జూన్ 17: నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే కామినేని సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కామినేని కార్యాలయ సిబ్బంది తెలిపారు. మంగళవారం సాయంత్రం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశామని అధికారులంతా ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. అలాగే మంగళవారం ఉదయం 10 గంటలకు కలిదిండి మండలం ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్లో, 10.30 గంటలకు కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 11.30 గంటలకు మండవల్లి జడ్పీ హైస్కూల్లో, 12 గంటలకు ముదినేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు.



నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : కామినేని

కైకలూరు, జూన్ 17: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరితో కలసి పనిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు మండలం వరహాపట్నంలోని తన స్వగృహంలో కూటమి నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలు, ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చి కామినేనికి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు అభిమానులు గజమాలతో ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం అనారోగ్యానికి గురయ్యానని అందువల్ల గత కొద్ది రోజులుగా ప్రజలకు అందుబాటులో లేనని ఇకపై నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడదామన్నారు. ప్రజాభిమానంతో నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.


పోలవరంలో ముదినేపల్లి టీడీపీ నాయకులు

పోలవరం తరలిన టీడీపీ నేతలు

ముదినేపల్లి, జూన్ 17 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు రావడంతో ముదినేపల్లి మండలం నుంచి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోలవరం తరలివెళ్లారు. పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలసి కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో-కన్వీనర్ తేరా రమేష్, జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, తెలుగుయువత జిల్లా కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, పార్టీ నాయకులు పోలవరం వెళ్లారు. కృష్ణా తూర్పు డెల్టా రెండు పంటలకు సాగునీరందేందుకు, ఆక్వా రంగానికి జీవం పోసేందుకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణమే శరణ్యమని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుకు వివరించారు.



మురళీమోహన్‌ను కలసిన కూటమి నాయకులు

ముదినేపల్లి, జూన్ 17 : మాజీ ఎంపీ, సినీ నటుడు మురళీ మోహన్‌ను ముదినేపల్లి టీడీపీ, బీజేపీ నాయకులు కలిశారు. సోమవారం కృష్ణా జిల్లా కూచిపూడిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మురళీమోహన్‌ను కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తోపాటు టీడీపీ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పైడిపాటి శివశంకర్, ప్రసాద రాజు కలిశారు. ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఘన విజయంతో ఏపీలో నూతన శకం ఆరంభమైందని, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల కృషిని మురళీ మోహన్ అభినందించారు.



డల్లాస్ వేడుకల్లో టీడీపీ నేత విఠల్

ముదినేపల్లి, జూన్ 17 : ఏపీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించినందుకు సోమవారం అమెరికాలోని డల్లాస్‌లో కూటమి ఎన్ఆర్ఐ విభాగం నిర్వహించిన విజయోత్సవంలో ముదినేపల్లి మండలం కాకరవాడకు చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరు విఠల్ పాల్గొన్నారు. ఎన్ఆర్ఐ టీడీపీ డల్లాస్ విభాగం కన్వీనర్ జాస్తి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విజయోత్సవంలో విఠల్ ప్రసంగించారు. కూటమి ఏపీ నాయకులతోపాటు ఇతర దేశాల్లోని ఎన్ఆర్ఐల కృషి కూడా తోడై ఘన విజయం లభించిందని విఠల్ పేర్కొంటూ కూటమి ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఏపీలో పారిశ్రామికాభివృద్ధికి ఎన్ఆర్ఐలు తమ సహకారం అందించాలని కోరారు.



మొక్కు తీర్చుకునేందుకు గుణదలకు టీడీపీ శ్రేణులు

చాట్రాయి, జూన్ 17: నూజివీడు ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారథి ఎన్నికై మంత్రి పదవి చేపట్టాలని, రాష్ట్రంలో కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ మండలంలోని పోలవరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుణదల మేరీమాతకు మొక్కుకున్నారు. ఈ మేరకు సోమవారం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, స్థానిక నాయకుడు యర్రా హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది పార్టీ శ్రేణులు వాహనాలపై గుణదల తరలివెళ్ళారు.



బాబాకు ప్రత్యేక పూజలు

మండవల్లి, జూన్ 17: మండవల్లిలోని శిరిడి సాయిబాబా ధ్యానమందిరం 14వ ఆలయ వార్షిక మహోత్సవం సందర్భంగా సోమవారం అభిషేకం, విశేష అలంకరణ చేశారు. విజయవాడ వాస్తవ్యులు శ్రీ అఖిలాండ అఖండ జ్యోతి వ్యవస్థాపకులు, శ్రీరాంజీ గురూజీ నేతృత్వంలో హోమాల అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించండి

ముసునూరు, జూన్ 17: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, భవిత సెంటర్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో బీవీ సుబ్బారావు అన్నారు. నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా సోమవారం రమణక్కపేట ఎంపీపీ పాఠశాలలోని భవిత సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఐఈఆర్టీలు, నారాయణరావు, నాగమల్లీశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బ్యాంక్ మేనేజర్ దుర్గారావుకు బదిలీ సత్కారం

మండవల్లి, జూన్ 17: మండవల్లి ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసి బదిలీ అయిన బొంతు దుర్గారావును సోమవారం ఖాతాదారులు, డ్వాక్రా యానిమేటర్లు, బ్యాంకు మిత్రలు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. దుర్గారావు సేవలను కొనియాడారు. మెండా సురేష్‌బాబు స్వాగతం పలకగా ఎల్ఎస్ భాస్కరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, గ్రామ ప్రముఖుడు గుడివాడ మురళీకృష్ణ, గన్నవరం సర్పంచ్ తమ్మిస్వామి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాళ్ళపాలెం డాక్టర్ విగ్రహావిష్కరణ

కైకలూరు, జూన్ 17: ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించిన కాళ్ళపాలెం డాక్టర్ బత్తిన నరసింహారావు విగ్రహావిష్కరణ మంగళవారం నిర్వహించనున్నారు. కైకలూరు మండలంలోని అగ్రహారంలో డాక్టర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ విగ్రహాన్ని ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు నుంచి ఊరేగింపుగా అగ్రహారం తీసుకువచ్చారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

బాలసాయి జయంతి వేడుకలు



ముదినేపల్లి, జూన్ 17 : బొర్రా బాల సాయి ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం పేదలకు అన్నదానం చేశారు. ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్త బాలసాయి జయంతి సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకుడు టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ నాయకులు పరసా విశ్వేశ్వరరావు, పంతగాని సురేష్, పరసా కనకరావు, వీరంకి చక్రపాణి, బొంగు రవికుమార్ తదితరులు కేక్ కట్‌చేసి బాలసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మంత్రి సారథికి మాదల అభినందన



ఆగిరిపల్లి, జూన్ 17: నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణ, సమాచారశాఖా మంత్రి కొలుసు పార్థసారథిని ఎస్ఎస్సీ డీసీ కమిటీ ఈదర మాజీ చైర్మన్ మాదల నరేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ ప్రాంతానికి కొత్తవాడినైనా తనను ఆదరించి గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని సారథి అన్నారు.

నేడు కామినేని ముదినేపల్లి రాక

ముదినేపల్లి, జూన్ 17 : శాసనసభ్యుడిగా ఎన్నికయ్యాక కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తొలిసారిగా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముదినేపల్లి మండలానికి మంగళవారం రానున్నారు. ముదినేపల్లిలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, కిట్లు కామినేని పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు.



విద్యార్థులకు 40 సైకిళ్ల వితరణ

ముసునూరు, జూన్ 17: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదివి అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలని దాత రాయంకుల రామారావు అన్నారు. సోమవారం గుడిపాడు జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు రూ.రెండున్నర లక్షల విలువగల 40 సైకిళ్ళను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూల్ ప్రస్తుతం జడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యేందుకు కృషి చేశామన్నారు. గుడిపాడు, గుళ్ళపూడి, వలసపల్లి తదితర గ్రామాల విద్యార్థులుఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయసహకారాలను ఎల్లప్పుడూ అందిస్తామని రామారావు పేర్కొన్నారు. గత ఏడాది 10వ తరగతి పరీక్షల్లో 503 మార్కులు సాధించిన నూర్‌బాషా ఫరీజాకు ప్రోత్సాహ బహుమతిని ఆయన అందజేశారు. ఉపాధ్యాయులు దాతను సన్మానించారు. గ్రామ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కలిదిండి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ముదినేపల్లి మసీదులో బక్రీద్ వేడుకల్లో ముస్లింలు


చనుబండలో ప్రసంగిస్తున్న మతపెద్ద

త్యాగానికి మారుపేరు.. బక్రీద్

మసీదుల్లో ముస్లిం సోదరుల ప్రత్యేక నమాజ్‌లు

కైకలూరు, జూన్ 17: త్యాగశీలమైన హృదయంతో శాంతియుతంగా జీవించడమే బక్రీద్ పండుగలోని పరమార్థమని ముస్లిం మత పెద్దలు బోధించారు. సోమవారం కైకలూరు పెద్ద మసీదు, చిన్న మసీదు ఆధ్వర్యంలో బక్రీదు వేడుకలను జరుపుకున్నారు. ముస్లింలంతా ర్యాలీగా ఈద్గాకు వెళ్లి నమాజు చేశారు. మత పెద్దలు నమాజ్‌లు చేయించి దైవ సందేశాన్ని అందించారు. అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ప్రార్థనల్లో మాజీ వైస్ ఎంపీపీ ఎండీ రహీం, టీడీపీ నాయకులు ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, సయ్యద్ బాషిద్, బాజానీ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలోని ముస్లింలు బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కలిదిండి మసీదులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపచేయటమే బక్రీద్ ముఖ్య ఉద్దేశ్యమని మత పెద్దలు పేర్కొన్నారు. అన్ని గుణాల కన్నా దాన గుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశమన్నారు. అలాగే మూల్లంకలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ముదినేపల్లి: బక్రీద్ సందర్భంగా మసీదు కమిటీ అధ్యక్షుడు ఫతే అహ్మద్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సంప్రదాయం ప్రకారం మాంసాహారం బంధు మిత్రులకు పంచిపెట్టారు. ముదినేపల్లి నుంచి హజ్ యాత్రకు వెళ్లి వచ్చిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్‌ను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముసునూరు, గోపవరం, చెక్కపల్లి, గుడిపాడు తదితర గ్రామాల్లోని మసీదుల్లో నమాజులు నిర్వహించారు. త్యాగానికి, సత్యానికి ప్రతీక అయిన బక్రీద్ విశిష్టతను మత గురువులు వివరించారు.

నూజివీడు టౌన్: నూజివీడు ఈద్గా వద్ద ముస్లింలు సోమవారం ప్రత్యేక నమాజు నిర్వహించారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని విజయవాడ రోడ్డులో గల జామియా మసీదులో బక్రీదు ప్రార్థనలు జరిగాయి. ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ పేదలకు కుర్బానీ చేస్తారని మసీదు కమిటీ ప్రెసిడెంట్ ఎస్కే చాన్‌బాషా తెలిపారు.